www.aknu.edu.in
nannayavani@aknu.edu.in
nannayanewstv
Adikavi Nannaya University
9701293231

విశ్వవిద్యాలయ స్థాయి తొలి తెలుగు వార పత్రిక

# నన్నయ వాణి

ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం, రాజమహేంద్రవరం - ఆంధ్రప్రదేశ్

గౌరవ సంపాదకులు
ఆచార్య మొక్కా జగన్నాథరావు
ఉపకులపతి

ప్రధాన సంపాదకులు
ఆచార్య తుపాకుల అశోక్
కుల సచివులు

సంపాదకులు
డా. తలారి వాసు, సహాయాచార్య, తెలుగు శాఖ
పువ్వల ఆనంద్, ప్రజా సంబంధాల అధికారి, కోఆర్డినేటర్, మీడియా సెల్

సంపుటి : 2 | సంచిక : 28 | 18-04-2022 | పుటలు : 4



ఏప్రిల్ 22

ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం

వ్యవస్థాపక దినోత్సవ

శుభాకాంక్షలు!!

## 18 నుండి నన్నయలో పీజీ స్పాట్ అడ్మిషన్స్

**13.04.22 (మీడియాసెల్)** ఈ నెల 18వ తేదీ నుండి ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంలో పీజీ స్పాట్ అడ్మిషన్స్ ను నిర్వహిస్తున్నామని వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు తెలిపారు. బుధవారం విశ్వవిద్యాలయంలో దీనికి సంబంధించిన ఒక ప్రకటనను వీసీ విడుదల చేసారు. ఆదికవి నన్నయ యూనివర్సిటీ రాజమహేంద్రవరం, కాకినాడ, తాడేపల్లిగూడెం క్యాంపస్ లలో సైన్స్, ఆర్ట్స్, ఎం.పి.ఈడీ కోర్సులకు సంబంధించిన స్పాట్ అడ్మిషన్స్ ను నిర్వహిస్తున్నామని తెలిపారు. సైన్స్ కోర్సులకు ఈ నెల 18వ తేదీన, ఆర్ట్స్ కోర్సులకు 19వ తేదీన స్పాట్ కౌన్సిలింగ్ జరుగుతుందన్నారు. డైరెక్టర్ ఆఫ్ అడ్మిషన్స్ వారు స్పాట్ అడ్మిషన్స్ ప్రక్రియను నిర్వహిస్తారని, స్పాట్ అడ్మిషన్స్ కోసం వచ్చే అభ్యర్థులు విశ్వవిద్యాలయం ఉదయం 11 గంటల లోపు వచ్చి రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని చెప్పారు. ఆయా కోర్సులలో ఖాళీ ఉన్న సీట్ల వివరాలు, ఫీజు వివరాలు యూనివర్సిటీ వెబ్ సైట్ లో పొందుపరిచామని తెలిపారు.

## బీకాం పరీక్ష 25కి వాయిదా

ఆదికవి నన్నయ విశ్వ విద్యాలయం అనుబంధ కళాశాలలో బుధవారం జరగాల్సిన బీకాం, బీకాం కంప్యూటర్స్ లోని వెబ్ టెక్నాలజీస్ పరీక్షను ఈనెల 25వ తేదీకి వాయిదా వేస్తున్నట్లు కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ఎస్.లింగారెడ్డి తెలిపారు. వెబ్ టెక్నాలజీస్ పేపర్ లో కొన్ని ప్రశ్నలు అవుట్ ఆఫ్ సిలబస్ లో ఉండడాన్ని ముందుగానే గుర్తించడం ద్వారా పరీక్షను రద్దు చేశామని చెప్పారు. ఈ పరీక్షను 25వ తేదీన ఉదయం 9 గంటలనుండి 12 గంటల వరకు నిర్వహిస్తున్నామని చెప్పారు. విశ్వవిద్యాలయ పరిధిలో పరీక్ష రాస్తున్న విద్యార్థులు అందరికీ ఈ సమాచారాన్ని అందజేశామని విద్యార్థులందరూ ఈనెల 25వ తేదీన జరిగే పరీక్షలకు హాజరు కావాలని సూచించారు.

# త్వరలో నాక్ గుర్తింపు సాధిస్తాం, నన్నయ వర్సిటీని అభివృద్ధి చేస్తాం



సమావేశంలో మాట్లాడుతున్న వీసీ జగన్నాథరావు

**12.04.22 (మీడియాసెల్)** ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయానికి న్యాక్ లో మంచి గుర్తింపు తీసుకువచ్చి విశ్వవిద్యాలయాన్ని అభివృద్ధి చేస్తామని ఉపకులపతి ఆచార్య మొక్కా జగన్నాథరావు అన్నారు. యూనివర్సిటీ సెమినార్ హాల్ లో మంగళవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు మాట్లాడారు. కోవిడ్ సంక్షోభంలో ఆన్లైన్ ప్లాట్ ఫాం ను సమర్థవంతంగా వినియోగించుకున్నామని అన్నారు. తక్కువ సమయంలో వందకు పైగా వెబినార్లు నిర్వహించి ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్, ఆసియా బుక్ ఆఫ్ రికార్డ్స్ సాధించామని చెప్పారు. నాక్ సాధనకు విశేషమైన కృషి చేస్తున్నామని, దానిలో భాగంగా ఐ.ఎస్.ఓ., ఏ.ఐ.సి.టి.ఇ. సర్టిఫికెట్లు సాధించామని తెలిపారు. ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం రాజమహేంద్రవరం, కాకినాడ, తాడేపల్లిగూడెం ప్రాంగణాలలో భవనాలు, వసతులు అభివృద్ధి పరుస్తున్నామన్నారు. రాజమహేంద్రవరం ప్రాగణంలో సివిల్ మెకానికల్ భవనాలు నిర్మించామని, కాకినాడ ఎం.ఎస్.ఎన్ క్యాంపస్ లో హాస్టల్ భవనాన్ని ప్రారంభించామన్నారు. తాడేపల్లిగూడెంలో ఫార్మసి కళాశాల భవనం, హాస్టల్ భవనాలు నిర్మించామని త్వరలో వాటిని ప్రారంభిస్తామని చెప్పారు. నన్నయ విశ్వవిద్యాలయ క్రీడాభివృద్ధి కోసం ఖేలో ఇండియా నిధులు కేటాయించారని వాటితో ఇండోర్ స్టేడియం, స్విమ్మింగ్ పూల్ లను నిర్మిస్తామన్నారు. క్యాంపస్ గ్రీనరీ అభివృద్ధిలో భాగంగా భూగర్భజలాలు పెంచుతూ ఇంకుడు గుంతలు త్రవ్వించామని, త్వరలో కోటి రూపాయలతో గ్రీనరీ డెవలప్మెంట్ ప్రాజెక్టు చేపడతామన్నారు. వినియోగ్, వినిమయ, గేట్ కోచింగ్, నన్నయ విజ్ఞాన భారతి, స్టూడెంట్స్ క్లబ్స్ వంటి కార్యక్రమాలతో విద్య, పరిశోధన, బోధనలను మెరుగుపరుస్తున్నామన్నారు. జాతీయ అంతర్జాతీయ సంస్థలతో సహకారంతో విశ్వవిద్యాలయంలో అభివృద్ధి కార్యక్రమాలు, ప్రోజెక్టులు చేపడుతున్నాం. ఆంధ్రప్రదేశ్ ఉన్నత విద్యామండలి సూచనల మేరకు ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం, జె.ఎన్.టి.యు కాకినాడ, డా.వై.ఎస్.ఆర్. హార్టకల్చర్ యూనివర్సిటీ, ఎన్.ఐ.టి. ఆంధ్రప్రదేశ్ లు క్లస్టర్ యూనివర్సిటీ ఏర్పాటై కార్యక్రమాలు చేస్తున్నాం. నాక్ ప్రపోజల్స్ అప్ లోడ్ చేసాం. నాక్ సాధన తర్వాత రూసా నిధులు తీసుకువచ్చి వర్సిటీ అభివృద్ధి చేస్తాం. డిస్టెన్స్ ఎడ్యుకేషన్ ప్రారంభిస్తాం. రెండు నెలల్లో నాక్ ఫిజికల్ టీమ్ వచ్చి నన్నయ విశ్వవిద్యాలయానికి మంచి గ్రేడ్ ఇస్తారని ఆశిస్తున్నాం. హెచ్.ఆర్.డి. సెంటర్ ఏర్పాటు చేసి అనుబంధ కళాశాలల అధ్యాపకుల బోధన సామర్థ్యాలను పెంచుతూ శిక్షణ తరగతులు నిర్వహిస్తాం. క్యాంపస్‌లో ర్యాగింగ్ లేకుండా కట్టుదిట్ట ఏర్పాట్లు చేసాం. యూనివర్సిటీలో ఎటువంటి అసాంఘిక కార్యక్రమాలూ జరగకుండా ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నాం, సైకలాజికల్ కౌన్సిలింగ్ సర్వీసెస్ అందిస్తున్నాం. విద్యార్థుల ప్రత్యక్ష పర్యవేక్షణ నిమిత్తం రిటైర్డ్ మిలటరీ ఉద్యోగిని యూనివర్సిటీ సెక్యూరిటీ అధికారిగా నిర్మించాం. యూనివర్సిటీని అన్నివిధాలా అభివృద్ధి పథంలో ముందుకు తీసుకు వెళుతున్నాం, వర్సిటీ అభివృద్ధికి అందరూ సహకరించాలి. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య టి.అశోక్, ఓ.ఎస్.డి. ఆచార్య ఎస్.టేకి, యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ ప్రిన్సిపాల్ డా.వి.పెర్సిస్ తదితరులు పాల్గొన్నారు.

# 19న నన్నయ వర్సిటీలో 'కందుకూరి జయంత్యుత్సవం'

### బ్రోచర్ ఆవిష్కరించిన వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు

**13.04.22 (మీడియాసెల్)** ఈ నెల 19 న ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం సెమినార్ హాల్ లో కందుకూరి జయంత్యుత్సవం - కందుకూరి@175 గ్రంథావిష్కరణ కార్యక్రమం జరుగుతుందని వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు తెలిపారు. దీనికి సంబంధించిన బ్రోచర్ ను వీసీ ఆవిష్కరించి వివరాలను తెలియజేసారు. కె.ఆర్.ఎస్ - టి.ఎస్.బి.ఎడ్యుకేషనల్ చారిటబుల్ బ్రహ్మ సమాజ ట్రస్ట్, కాకినాడ సౌజన్యంతో యుగపురుషుడు, నవయుగ వైతాళికుడు శ్రీ కందుకూరి వీరేశలింగం జయంత్యుత్సవం - కందుకూరి@175 గ్రంథావిష్కరణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. ఈ నెల 19వ తేది ఉదయం 11 గంటలకు యూనివర్సిటీ సెమినార్ హాల్ లో జరిగే ఈ కార్యక్రమంలో "సుబ్రహ్మణ్య భారతి దృష్టిలో కందుకూరి" అనే అంశంపై ప్రధానవక్త మేనేజింగ్ ట్రస్టి, చెన్నపూరి తెలుగు అకాడమీ డా.తూమాటి సంజీవరావు ఉపన్యసిస్తారన్నారు. అతిథులుగా డా.దాట్ల దేవదానంరాజు, పల్లెసిరి కార్యదర్శి పలుకూరు మురళీధర్ హాజరై సందేశాలనందిస్తారని చెప్పారు. కార్యక్రమ కన్వీనర్ గా తెలుగు విభాగాధిపతి డా.కె.వి.ఎన్.డి.వరప్రసాద్


బ్రోచర్ ఆవిష్కరిస్తున్న వీసీ జగన్నాథరావు

వ్యవహరిస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఓ.ఎస్.డి. ఆచార్య ఎస్.టేకి, తెలుగుశాఖ అధ్యక్షులు డా.కె.వి.ఎన్.డి.వరప్రసాద్, అధ్యాపకులు డా.టి.సత్యనారాయణ, డా.డి.లక్ష్మీనరసమ్మ పాల్గొన్నారు.

# సంపాదకీయం



## ఏప్రిల్ 22

అవునండి. విశ్వవిద్యాలయ వ్యవస్థాపక దినోత్సవం. 2006 ఏప్రిల్ 22 న విశ్వవిద్యాలయం ప్రారంభమైంది. పదహారేళ్లవుతోంది. గోదావరి జిల్లాల ప్రజల అభీష్టం నెరవేరింది. దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైయస్ రాజశేఖరరెడ్డి గారు వ్యస్థాపకులు. మంత్రివర్యులు జక్కంపూడి రామ్మోహనరావు గారికి రాజమహేంద్రవరం లోనే విశ్వవిద్యాలయం ఉండాలనే ఆశయం నెరవేరింది. గోదావరి విశ్వవిద్యాలయ సాధన సమితి కృషి ఫలించింది. చదువులతల్లి ఆశీస్సు లభించింది.

ఆదికవి నన్నయ విగ్రహప్రతిష్ట సాక్షిగా జాతీయ రహదారిని ఆనుకొని ఉన్న వందెకరాల వెలుగుబంద నేల మీద విశ్వవిద్యాలయం క్షణక్షణాభివృద్ధిని పొందుతోంది.

పరిపాలనా భవనాలు, విలువైన పుస్తకాలతో కేంద్ర గ్రంథాలయం, విద్యార్థుల తరగతి గదులతో సైన్స్, ఇంజనీరింగ్ భవనాలు, కన్వెన్షన్ సెంటర్,విద్యార్థుల హాస్టల్స్, హెల్త్ సెంటర్,క్రీడా ప్రాంగణం, రోడ్లు ఇవన్నీ భౌతికమైన సౌకర్యాలు.

12 బి స్టేటస్, ఏ.ఐ.సి.టి.ఇ, ఐ.ఎస్.ఓ గుర్తింపు పత్రాలు, పర్యావరణ ప్రాంగణం,కోవిడ్ వంటి విపత్కర స్థితిలో వందకుపైగా వెబినార్స్, గోదావరి జిల్లాల కళాశాలలకు మార్గదర్శకాలు... ఇలా ఎదుగుతూ విశ్వవిద్యాలయం త్వరలో న్యాక్ గ్రేడింగ్ పొందే పనిలో ఉంది. ఇదంతా విద్యాపరమైన అభివృద్ధి.

రాబోయే రోజుల్లో న్యాక్ గుర్తింపుతో మరిన్ని మౌలిక వసతుల్ని, నిధుల్ని, అవకాశాల్ని విశ్వవిద్యాలయం చేజిక్కించుకుంటుంది. బ్రహ్మాండమైన విజయాల్లో బ్రహ్మాండమైన మౌనం కూడా ఉంటుంది.వ్యక్తి అయినా,వ్యవస్థ అయినా పడిన ఇబ్బందుల్లో నుంచి, కష్టాల్లోంచి నేర్చుకున్న పాఠమే 'మౌనం'! మనం గెలిచే వరకు మనకథగానీ, మన ప్రస్తావన కానీ ఎవరికి అవసరం ఉండదు. విజయాన్ని సొంతం చేసుకున్న తర్వాతే అసలు కథ మొదలౌతుంది.ప్రతి విజేత ఒక గ్రామ దేవత. ప్రతి వ్యవస్థ మౌనంగా వందలాది మందికి నీడనిచ్చి, వేలాది మందికి దారి చూపుతుంది. ఆ మౌనాన్ని, ఆ విజయాల్ని సమాజం గుర్తిస్తుంది, తోడ్పడుతుంది.

పదిహేనేళ్ల విశ్వవిద్యాలయ అభివృద్ధి క్రమంలో ఎన్నో బాలారిష్టాలు.ఎన్నో ఆటుపోట్లు. అజ్ఞాత వ్యక్తుల వెన్నుపోట్లు.

ఆంధ్ర మహాభారతాన్ని తెలుగు భాషకు, సాహిత్యానికి, తెలుగువారికి అందించిన నన్నయభట్టారకుని పేరుమీదుగా ఏర్పడిన విశ్వవిద్యాలయమిది. ఏదైనా తట్టుకుని నిలబడటానికి ప్రేరణగా నిలిచిన తూర్పు చాళుక్య ప్రభువు రాజరాజనరేంద్రుడు వెన్నుదన్ను. వెయ్యేళ్ల క్రితం ఈ నేలపై గౌతమీ తీరం సాక్షిగా వారి వైభవం తెలుగు వారికి పరిచయమే. వారిరువురికి ధ్యాస, విశ్వవిద్యాలయం కోసం కృషిచేసిన మహనీయుల శ్వాస అండదండగా వెలుగుబంద గడ్డపై విశ్వవిద్యాలయం నిరంతరం విద్యా పరిమళాల్ని వెదజల్లుతూ వెలుగొందుతూనే ఉంటుంది.

*ఆ నన్నయ వెలుగులో వేల మంది విద్యార్థుల జీవితాలు దేదీప్యమానం కావాలన్నదే అందరి ఆకాంక్ష!!*

# అంబేద్కర్ ఆశయ సాధనకు కృషి చేద్దాం

**14.04.22 (మీడియాసెల్)** విద్యతోనే సమాజంలో మార్పు సాధ్యమని విశ్వసించిన మహనీయుడు డా.బాబాసాహేబ్ అంబేద్కర్ అని, అంబేద్కర్ ఆశయ సాధనకు అందరూ కృషి చేద్దామని వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు అన్నారు. ఆదికవి నన్నయ యూనివర్సిటీలో అంబేద్కర్ 131 వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు, రిజిస్ట్రార్ ఆచార్య టి.అశోక్, సెంటర్ ఫర్ డెమోక్రసి విజయవాడ కె.ఎన్.వెస్లీ, డిప్యూడి సివిల్ సర్జెన్ కేంద్ర కారాగారం రాజమండ్రి డా.పి.కోమల మరియు విశ్వవిద్యాలయ అధికారులు, అధ్యాపకులు హాజరయ్యారు. యూనివర్సిటీలోని డా.బి.ఆర్.అంబేద్కర్ సెంట్రల్ లైబ్రరీ ఎదురుగా ఉన్న అంబేద్కర్ విగ్రహానికి వీసీ పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం యూనివర్సిటీ సెమినార్ హాల్లో జరిగిన కార్యక్రమంలో వీసీ ఆచార్య జగన్నాథరావు మాట్లాడుతూ అంబేద్కర్ ఆశయ సాధనకు అందరూ కృషి చేయాలని అన్నారు. విద్యతోనే సమాజంలో మార్పు సాధ్యమని విశ్వసించిన మహనీయుడు అంబేద్కర్ అని కొనియాడారు.అంబేద్కర్ ను ఆదర్శంగా తీసుకొని గురువులు విద్యార్థులకు చక్కని మార్గనిర్దేశం చేయాలన్నారు. అంబేద్కర్ విద్యార్థి యొక్క సమగ్రాభివృద్ధిని విశ్వసించారని, బోధన పద్ధతులకు సమగ్ర విధానాన్ని కోరుకున్నారని చెప్పారు. మంచి గురువు తన



డా.బి.ఆర్.అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న వీసీ



అంబేద్కర్ జయంతి వేడుకలలో ప్రసంగిస్తున్న వీసీ జగన్నాథరావు

విద్యార్థులకు స్నేహితుడు, తత్వవేత్త మరియు మార్గదర్శకుడుగా ఉండాలని తెలిపారు. అటువంటి ఉత్తమ గురువులు విశ్వవిద్యాలయలకు అవసరమని చెప్పారు. నన్నయ విశ్వవిద్యాలయ అభివృద్ధికి, సమాజాభివృద్ధికి అంబేద్కర్ ఆశయ సాధకులుగా మనమంతా కృషి చేయాలని తెలియజేసారు. సెంటర్ ఫర్ డెమోక్రసి విజయవాడ కె.ఎన్.వెస్లీ మాట్లాడుతూ సమాజహితం కోసం పని చేసిన ప్రపంచ మేధావి డా.బి.ఆర్. అంబేద్కర్ అని కొనియాడారు. ఎన్నో గ్రంథాలను చదివి అపారమైన విద్య, విజ్ఞానాన్ని సంపాదించుకున్నారని చెప్పారు. అంబేద్కర్ రచనలు నేటి సమాజానికి ఎంతో అసరమని తెలిపారు. విద్యార్థి దశలో అంబేద్కర్ చేసిన రచనలు రిజర్వు బ్యాంక్ ఏర్పాటులో కారణాలయ్యాయని తెలియజేసారు. డిప్యూడి సివిల్ సర్జన్ కేంద్ర కారాగారం రాజమండ్రి డా.పి.కోమల మాట్లాడుతూ విద్యావేత్తలు కావాలంటే అంబేద్కర్ రచనలు చదవాలని ఆంగ్లభాషపై పట్టు, ఉద్యోగ నైపుణ్యాలు అన్ని రకాల పరిజ్ఞానం అంబేద్కర్ రచనలలో దొరుకుతుందని తెలిపారు. భారతీయులకు అంబేద్కర్ రాజ్యాంగం మత గ్రంథము వంటిదని, అందరి దగ్గర భారత రాజ్యాంగం ఉండాలని ఆకాంక్షించారు. అనంతరం అతిథులను సన్మానించి జ్ఞాపికలను అందజేసారు. ఈ కార్యక్రమంలో విశ్వవిద్యాలయ అధికారులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

# ఎం.ఎస్.ఎన్. క్యాంపస్‌లో అంబేద్కర్ జయంతి




అంబేద్కర్ గురించి ఉపన్యాసిస్తున్న రవీంద్రబాబు

**14.04.22 (మీడియాసెల్)** భారతరత్న డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ గారి 131వ జయంతిని పురస్కరించుకుని ప్రిన్సిపల్ డా. ఎం. కమల కుమారి అధ్యక్షతన విద్యార్థులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథి పండుల రవీంద్రబాబు హాజరై మాట్లాడుతూ అంబేద్కర్ సిద్ధాంతాలు, ఆశయాలు ఆధునిక భారత నిర్మాణంలో కీలకపాత్ర వహిస్తాయని అలాగే ఎన్నో గొప్ప సంస్కరణలు తీసుకొచ్చిన వ్యక్తిగా కొనియాడారు. పిదప విద్యార్థులు అడిగిన ప్రశ్నలను నిజ జీవితానికి అనుసంధానిస్తూ జ్ఞానాన్ని ఏ విధంగా పెంపొందించు కోవాలని ముచ్చటించారు. ఈ సందర్భంగా క్యాంపస్ ప్రిన్సిపల్ ముఖ్య అతిథిని సత్కరించారు. విద్యార్థుల్లో ఉత్సాహాన్ని నింపినందుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎం. పోచయ్య, విజయశ్రీ ,ఎం. సత్యనారాయణ, అజయ్ రతన్ బోధన, బోధనేతర సిబ్బంది మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

# గూడెం క్యాంపస్‌లో అంబేద్కర్ జయంతి




**14.04.22 (మీడియాసెల్)** ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం తాడేపల్లిగూడెం క్యాంపస్ లో డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ 131 జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపాల్ ఆచార్య కె.శ్రీరమేష్ అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంబేద్కర్ అందరివాడని, ఆయనను ఆదర్శంగా తీసుకుని విద్యావంతులుగా ఎదగాలని పిలుపునిచ్చారు. అంబేద్కర్ ఎన్నో శ్రమలను అధిగమించి దేశానికి గొప్ప రాజ్యాంగాన్ని ఇచ్చారని తెలియజేశారు. అంబేడ్కర్ ఆశయాలకు అనుగుణంగా దేశాభివృద్ధి కోసం పాటుపడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు విద్యార్థులు పాల్గొన్నారు.

# నన్నయలో వినయ్ సుంకర జయంతి



వినయ్ సుంకర విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పిస్తున్న వీసీ

**14.04.22 (మీడియాసెల్)**ఆదికవి నన్నయ యూనివర్సిటీ డాక్టర్ వినయ్ సుంకర హెల్త్ సెంటర్ లో వినయ్ సుంకర జయంతిని గురువారం నిర్వహించారు. వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు హాజరై డా.వినయ్ సుంకర విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ డాక్టర్ వినయ్ సుంకర ప్రమాదవశాత్తు మరణించిన తరువాత వారి తండ్రి డా.సుంకర వెంకటేశ్వరరావు డాక్టర్ వినయ్ సుంకర ఫౌండేషన్ ను స్థాపించి ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలను చేస్తున్నారని అన్నారు. దీనిలో భాగంగా ఆదికవి నన్నయ యూనివర్సిటీలో డాక్టర్ వినయ్ సుంకర ఫౌండేషన్‌ను స్థాపించారని చెప్పారు. విశ్వ విద్యాలయంలోని విద్యార్థులనే తమ పిల్లలుగా భావించి సేవలందిస్తున్నారు. ఇటువంటి దాతృత్వం కలిగిన వ్యక్తులను ఆదర్శంగా తీసుకొని సమాజానికి ఉపయోగపడే సేవా కార్యక్రమాలలో అందరూ పాల్గొనాలని అన్నారు. డాక్టర్ వినయ్ సుంకర ఆత్మకు శాంతి చేకూరాలని, ఫౌండేషన్ ద్వారా మరిన్ని సమాజహితమైన కార్యక్రమాలు జరగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో డా.సుంకర వెంకటేశ్వర రావు, కుటుంబ సభ్యులు, డిప్యూడి సివిల్ సర్జెన్ కేంద్ర కారాగారం రాజమండి డాక్టర్.పి.కోమల, ప్రిన్సి పాల్ డా.కె.సుబ్బారావు, అధ్యాపకులు డా.ఎం.గోపాలకృష్ణ, డా.బాలసత్యనారాయణ, దేవానంద్ పాల్గొన్నారు.



## ఫార్మసీ విద్యార్థుల షార్ట్ ఫిల్మ్ పోస్టర్ రిలీజ్



**తాడేపల్లిగూడెం** : ఆదికవి నన్నయ యూనివర్శిటీ, ఫార్మసీ విభాగం విద్యార్థులు కె. విజయ గోవింద్, ఎం. రమేష్, సి హెచ్ .స్వరూప్, ఎ. సంతోష్, జి. నరేంద్ర, పి. శ్రీ సత్య, పి. కుసుమ, ఎల్. దేవి నటీనటులుగా, రాధాకృష్ణ అన్కండిషల్ లవ్ అనే షార్ట్ ఫిల్మ్ లో నటించి ఆర్ వి ఎస్ క్రియేషన్స్ వారు దర్శకత్వం వహించి, ఆత్మీయ కథను నిర్మించారు.ఇందులో ఫార్మసీ విభాగ విద్యార్థులు చాలా కష్టపడి టీమ్ వర్క్ మరియు పట్టుదలతో ఈ షార్ట్ ఫిల్మ్ నిర్మించారు.ఈ చిత్రం సమకూర్చిన సిబ్బంది అందరు ప్రత్యేకంగా ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం సభ్యులు కావడం విశేషం.ఈ సందర్భంగా షార్ట్ ఫిల్మ్ డైరెక్టర్ కె. విజయ్ గోవింద్ పోస్టర్ విడుదల కార్యక్రమాన్ని నిర్వహించగా, ఫార్మసీ విభాగం కోర్స్ కోఆర్డినేటర్ డా.హీరా బట్టు, డా.సురేంద్ర బాబు, కె.నిత్యానందరెడ్డి ఇతర ఫార్మసీ అధ్యాపకులు పోస్టర్‌ను విడుదల చేసారు.ఈ కార్యక్రమంలో ఫార్మసీ విభాగం అధ్యాపకులు మరియు విద్యార్థులు చురుకుగా పాల్గొని, నటీనటులకి మరియు సిబ్బందికి గొప్ప విజయాన్ని చేకూరాలని ప్రోత్సహించారు.

## బయోమెడికల్ అప్లికేషన్స్ పై అవగాహన



ఆచార్య పమును అభినందిస్తున్న వీసీ

ఆదికవి నన్నయ యూనివర్సిటీ రాజమహేంద్రవరం క్యాంపస్ లో డిపార్ట్మెంట్ ఆఫ్ మెకానికల్ ఇంజనీరింగ్ ఆధ్వర్యంలో నిర్వహించిన అతిథిగా ఉపన్యాసంలో 'బయోమెడికల్ అప్లికేషన్స్ కోసం సిరామిక్స్ అభివృద్ధి' అనే అంశంపై ఐ.ఐ.టి. గౌహతి ఆచార్య డి.పము ఉపన్యాసించారు. విద్యార్థులకు బయోమెడికల్ అప్లికేషన్స్ కోసం సిరామిక్ అభివృద్ధికి సంబంధించిన విశ్లేషణాత్మక సందేశాన్ని అందించారు. ఈ సందర్భంగా వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు ఆచార్య డి.పము ను అభినందించారు. ఈ కార్యక్రమంలో ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వి పెర్సిస్, లక్ష్మి, మౌనిక అధ్యాపకులు పాల్గొన్నారు.

## నన్నయలో జ్యోతిరావు పూలే జయంతి వేడుకలు



పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళు లర్పిస్తున్న దృశ్యం

ఆదికవి నన్నయ విశ్వ విద్యాలయంలో సోమవారం జ్యోతిరావు పూలే జయంతి వేడుకలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులు రిజిస్ట్రార్ ఆచార్య టి.అశోక్, ఓ.ఎస్.డి. ఆచార్య ఎస్.టేకి హాజరై జ్యోతిరావు పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా రిజిస్ట్రార్ మాట్లాడుతూ జ్యోతిరావు పూలే సమాజంలోని అంటరానితనం, కులవ్యవస్థ నిర్మూలనపై పోరాటం చేసారని, వెనుకబడిన కులాల వారికి సమాన హక్కులు కల్పించేందుకు సత్యశోధక్ సమాజ్ ను ఏర్పాటు చేసాన్నారు. జ్యోతిరావుపూలే, సావిత్రిబాయిపూలే భారతదేశంలోని మహిళా విద్యకు మార్గదర్శకులుగా ఉంటూ మహిళోద్ధరణకు కృషి చేసారని తెలిపారు. బాలికల విద్య కోసం 1848 లో పూణేలో మొదటి పాఠశాలను ప్రారంభించారని చెప్పారు. పూలే వంటి మహనీయులను విద్యావేత్తలు, విద్యార్థులు ఆదర్శంగా తీసుకొని విద్యారంగంలో ఉన్నత శిఖరాలకు చేరుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డా.వి.పెర్సిస్, డా.పి.వెంకటేశ్వరరావు, డా.పి.విజయనిర్మల, డా.ఎన్.ఉదయ్ భాస్కర్, డా.ఎం.గోపాలకృష్ణ, అసిస్టెంట్ రిజిస్ట్రార్ జి.చంద్రకళ, ఎం.ఎస్.బి.రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# నవయుగ వైతాళికుడు కందుకూరి

**కందుకూరి వీరేశలింగం 175వ జయంతి**

**(ఏప్రిల్ 16)**


**తెలుగు నాటకరంగం దినోత్సవం**

**నాటకం అనేది ఒక శ్రవణ సహిత దృశ్య రూపకం.అతి ప్రాచీనమైన ప్రదర్శక కళల్లో ప్రధానమైంది నాటకం. నట అన్న పదం నాట్యం లోంచి పుట్టింది, నట అంటే అభినయం, నర్తనం అన్న అర్థం నాట్య శాస్త్రంలో చెప్పబడింది. నాట్య రూపకం అతిప్రాచీనమైన ప్రదర్శక కళల్లో ప్రధానమైంది. ఈ నాట్య రూపకాల్లోంచే కాలక్రమేణ నాటకం పుట్టింది. కాబట్టి నాట్య శాస్త్రంలోంచి పుట్టింది నాటకం అని పెద్దల ఉవాచ.**

**నాటకం చూసే ప్రేక్షకులు, నాటకం ప్రదర్శించే నటులు,నాటకం ప్రదర్శించబడే రంగస్థలం.**

ఈ మూడు సమాజంలోనివే కాబట్టి నాటక ప్రయోజనం కూడా సమాజానికి వేయిరెట్లు మేలు చేసేదై ఉంటుంది.పురాణ పాత్రలు ఆనాటి సమాజంలోని సత్య,నీతి నియమాలను ఏ విధంగా పాటించాయో,ఈనాటికీ ఆయా పాత్రలను మనం పూజనీయంగా భావిస్తున్నాం. వారు ఏర్పరచిన దారులు ఈనాటికే కాక రాబోయే తరాలకు కూడా ఏ విధంగా బంగారు బాటలు అవుతాయో తెలియజేస్తాయి. పౌరాణిక నాటకాలు. ఇక పద్య నాటకం అంటే బంగారానికి తావిలాంటిది. సుమారు వేయి సంవత్సరాల పైన చరిత్ర కలిగి ప్రాచీన భాష హెూదా పొందిన తెలుగు భాష ఈనాటికీ ప్రజల మధ్యలో సజీవంగా నిలబడటానికి ప్రధాన కారణాలలో పద్య నాటకం మొదటి కారణం. పద్య నాటకం ప్రదర్శించడం వల్ల చూడటం వల్ల పామరుడు కూడా పండితుడయ్యాడు.నిరక్షరాస్యులైన నటుడికి, ప్రేక్షకుడికి వయోజన విద్యలాంటిది పద్యనాటకం. పద్యనాటకంలో సాహిత్యం సంగీతంతో పాటు వినిపిస్తుంది కాబట్టి సంగీత ప్రియులకు సాహిత్యాన్ని మంచిగా అందిస్తుంది పద్య నాటకం.

తెలుగు నాటకరంగానికి వందల ఎళ్ల చరిత్ర ఉన్నది. పదహారవ శతాబ్దంలో ప్రారంభమైన నాటక ప్రక్రియను చిందు భాగవతం,యక్షగాన నాటకం, వీధి భాగవతం, బయలాట అనీ పిలుస్తారు. వీధి నాటకాలను ఎక్కువ ప్రచారంలోకి తెచ్చినవారు కూచిపూడి భాగవతులు. కాకతీయుల కాలంలో ప్రదర్శించిన క్రీడాభిరామం కూడా నాటకమే. నన్నయ తన భారత అవతారికలో రసాన్విత కావ్యనాటకముల్ పెక్కుజూచితి అనడాన్ని బట్టి, నన్నయ కాలానికి నాటక ప్రదర్శనలుండేవని అర్థం చేసుకొవచ్చు.1860 ప్రాంతాల్లో వెలువడిన తొలి తెలుగు నాటకం మంజరీ మధుకరీయం రచయిత కోరాడ రామచంద్ర శాస్త్రి లాంటి వారు ఆధునిక నాటక రచనకు ఆద్యులు. ఆధునిక నాటక ప్రదర్శన ఆరంభ దశకు రూపకర్తలైన వారందరిలోకెల్లా అగ్రగణ్యుడు కందుకూరి వీరేశలింగం పంతులు గారే.




కందుకూరి వీరేశలింగం వ్యావహారిక భాషలో రాసిన వ్యవహార ధర్మబోధిని తొలిసారిగా ప్రదర్శించబడిన తెలుగు నాటకం. 1880 లో వీరేశలింగం గారు నాటక సమాజాన్ని స్థాపించి రత్నావళి, చమత్కార రత్నావళి అనే రెండు నాటకాలను ప్రదర్శించారు. తెలుగు నాట తొలి నాటక సమాజాన్ని స్థాపించిన ఘనత కూడా వీరేశలింగం గారిదే. వీరి స్వతంత్ర రచన వ్యవహార ధర్మబోధిని, సంస్కృత నాటక అనువాదమైన రత్నావళి, ఆంగ్ల నాటక అనుసరణ అయిన చమత్కార రత్నావళి ప్రదర్శనా భాగ్యం పొందిన తొలి తెలుగు నాటకాలు. వీరేశలింగం పంతులు గారి పుట్టిన రోజైన ఏప్రిల్ 16 ను తెలుగు నాటక రంగ దినోత్సవంగా జరుపుకుంటున్నాం.

నవ్యతా ప్రయోక్త, సంస్కర్త, శతాధిక గ్రంథకర్త కందుకూరి వీరేశలింగం పంతులు సాహితీ ప్రీతితో, సంస్కరణ దృక్పథంతో స్పృశించని శాఖలేదు.చేపట్టని ప్రక్రియలేదు.ఆయన ప్రజ్ఞ బహుముఖాలుగా విస్తరించింది. ఆంధ్ర సాహిత్యంలో కవుల చరిత్రలు, జీవిత చరిత్రలు,స్వీయ చరిత్ర, శాస్త్ర సాహిత్యాది ప్రక్రియలన్నింటికీ ఆద్యులయ్యారు. సాహిత్యాన్ని ఆయన సంఘ సంస్కరణకు ఉపకరణంగా చేసుకున్నారు.ఆనాటి సంఘంలో గూడు కట్టుకొన్న మూఢాచారాలను పారద్రోలారు.

**తెలుగు నాటకరంగానికి వీరేంశలింగం కృషి**

గణనీయమైంది.19వ శతాబ్దిలో బాల్యవివాహాలు, మూఢనమ్మకాలు, కన్యాశుల్కం, అంటరానితనం, వేశ్యావృత్తి వంటి దురాచారాలు సమాజాన్ని పట్టి పీడిస్తున్నాయి. అప్పట్లో సామాజిక చైతన్యంతో, సంస్కరణ దృక్పథంతో ప్రజల్ని చైతన్యవంతులను చేసేందుకు శ్రవ్యకావ్యాల కంటే నాటకాలు శక్తివం తమైనవన్న ఆలోచనతో వీరేశలింగం 16 నాటకాలను రచించారు.

వీరేశలింగంగారి నాటకాల్లో బ్రాహ్మ వివాహం, వ్యవహార ధర్మబోధిని, అభిజ్ఞాన శాకుంతలం, సత్యహరిశ్చంద్ర, రత్నావళి వంటివి ప్రసిద్ధాలు. బ్రాహ్మ వివాహం నాటకం ఆయనకు మంచి పేరును తెచ్చింది. ఈ నాటకంలో ముక్కుపచ్చలారని బాలికను, కన్యాశుల్కానికి ఆశపడి ముసలివాడికిచ్చి పెళ్లి చేయడాన్ని అధిక్షేపించారు. ముసలివాళ్ల పెళ్లి ఆశను అవహేళన చేసి ప్రేక్షకుల కళ్లు తెరిపించారు. డబ్బు కక్కుర్తితో కన్యాశుల్కానికి ఆశపడి పిల్లల జీవితాలను నాశనం చేసే తల్లిదండ్రులను, పెళ్లిళ్ల పేరయ్యలను తీవ్రంగా నిరసించారు. వీరేశలింగంకి పేరు తెచ్చిన మరో నాటకం వ్యవహార ధర్మబోధిని. ఈ నాటకంలో న్యాయాధికారుల అవినీతిని, న్యాయవాదుల మోసాలను, వాదిప్రతివాదుల దుశ్చర్యలను బట్టబయలు చేశారు.

తెలుగు నాటకరంగం దినోత్సవంపై 2000లో పెద్ది రామారావు యవనిక త్రైమాసిక పత్రిక ద్వారా చర్చలు జరిగాయి. ఇతర దేశాల్లో, ఇతర రాష్ట్రాల్లో మాదిరి తెలుగు నాటకరంగం దినోత్సవం ఏర్పాటు చేసుకోవడం అవసరం అన్న ఆలోచన నాటకరంగ కళాకారులు, విమర్శకుల్లో కలిగింది. వ్యవహారిక భాషలో నాటకాలు రాసిన తొలినాటకకర్త, తొలి దర్శకుడు, తొలి ప్రదర్శనకారుడు, నాటక సమాజ స్థాపకుడైన వీరేశలింగం జయంతిని ఏప్రిల్ 16న తెలుగు నాటక రంగం దినోత్సవంగా ఏర్పాటు చేయాలని నాటకరంగం ప్రముఖులంతా ఏకాభి ప్రాయానికి వచ్చారు. కొన్ని నాటక రంగం సంస్థలు 2001 నుంచి వీరేశలింగం జయంతిని తెలుగు నాటకరంగం దినోత్సవంగా జరిపారు.

# క్రీడాకారులకు వీసీ అభినందనలు



కీడాకారులను అభినందిస్తున్న వీసీ జగన్నాథరావు


**14.04.22 (మీడియాసెల్)** ఆల్ ఇండియా ఇంటర్ యూనివర్సిటీ ఛాంపియన్షిప్ లో వెయిట్ లిఫ్టింగ్, బెస్ట్ ఫిజిక్ పోటీలలో కాంస్య పథకాలు సాధించిన క్రీడాకారులను వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు అభినందించారు. యూనివర్సిటీలో జరిగిన కార్యక్రమంలో క్రీడాకారులను సన్మానించి, జ్ఞాపికను, నగదు బహుమతిని అందజేసి అభినందిం చారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ 08.03.22 నుండి 12.03.22 వరకు చండీఘడ్ యూనివర్సిటీలో జరిగిన ఆల్ ఇండియా ఇంటర్ యూనివర్సిటీ ఛాంపియన్షిప్‌లో ఆదికవి నన్నయ విశ్వ విద్యాలయం నుండి ఇద్దరు క్రీడాకారులు కాంస్య పథకాలను సాధించారని చెప్పారు. ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయ అనుబంధ కళాశాల కె.ఎ.అండ్ హెచ్.ఎల్ డిగ్రీ కాలేజ్ ఏలూరు నుండి చిన్ని వినయ్ కుమార్ వెయిట్ లిఫ్టింగ్ లో కాంస్య పథకాన్ని సాధించారన్నారు.

అలాగే అనుబంధ కళాశాల శ్రీ సి.ఆర్.రెడ్డి ఏలూరు కు చెందిన కోడూరి పవన్ కుమార్ బెస్ట్ ఫిజిక్ లో కాంస్య పథకాన్ని సొంతం చేసుకున్నారని తెలిపారు.యూనివర్సిటీ తరుపున ఇద్దరు క్రీడాకారులు జాతీయ స్థాయిలో సత్తాచాటి ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయ ఔన్నత్యాన్ని పెంచారని క్రీడాకారులను వీసీ అభినందించారు. నన్నయ విశ్వవిద్యాలయంలో త్వరలో బెస్ట్ ఫిజిక్, వెయిట్ లిఫ్టింగ్ పోటీలు ఏర్పాటు చేస్తామని తెలియజేసారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య టి.అశోక్, స్పోర్ట్స్ బోర్డు కోఆర్డినేటర్ డా.కె.సుబ్బారావు, సెక్రటరీ డా.బి.రామ్ గోపాల్, డా.బి.వి.తిరుపాన్యం, డా.డి.వి.రమణ, విశ్వవిద్యాలయ పీడీలు పాల్గొన్నారు.



కీడాకారులను అభినందిస్తున్న వీసీ జగన్నాథరావు

# నన్నయభారతికి 200 గ్రంథాలు బహూకరణ



డాక్టర్ తలారి వాసుకు గ్రంథాలను అందిస్తున్న ప్రకాశరావు

రాజమండ్రి కొంతమూరు చెంచు కాలనీకి చెందిన విశ్రాంత ప్రిన్సిపాల్ పెదగాడి సూర్య ప్రకాశరావు తెలుగు, సంస్కృత, హిందీ, ఇంగ్లీష్ సాహిత్యంలోని 200 గ్రంథాలను విశ్వ విద్యాలయంలోని నన్నయ భారతికి అందించారని వీసీ మొక్కా జగన్నాథరావు తెలియ జేశారు. సాంఘిక సంక్షేమ కళాశాలలకు ప్రిన్సిపాల్ గా, జిల్లా కన్వీనర్ గా విశేష సేవలు అందించి ప్రిన్సిపాల్ గా వివిధ కళా శాలలకు, రాజమహేంద్రి డిగ్రీ, పీజీ కళాశాలకు విద్యా సేవలందించిన ప్రకాశరావు మంచి గ్రంథపఠనాభిలాషి అని తన వద్ద ఉన్న గ్రంథాలు విద్యా ర్థులకు కూడా అందుబాటులో ఉండాలని ఈ పుస్తకాలను అందించారని అన్నారు. వీటిని నన్నయ భారతి కోఆర్డినేటర్ డా.తలారి వాసు స్వీకరించి కృతజ్ఞతలు తెలియజేశారు. సాహిత్య సంబంధమైన ఈ గ్రంథాలు విశ్వవిద్యాలయ గ్రంథాలయంలో ఉంచి విద్యార్థులకు అందుబాటులో ఉంటున్నందుకు ప్రకాశ రావు ఆనందాన్ని వ్యక్తం చేశారు.వీసి జగన్నాథరావు, రిజిస్ట్రార్ ఆచార్య టి. అశోక్, ఓ.ఎస్.డి ఆచార్య ఎస్.టేకి, కోఆర్డినేటర్ లైబ్రరీ ఎఫైర్స్ డా.కె.రమణేశ్వరి, గ్రంథాలయాధికారి డా.తెర్లి సింహాచలం పెదగాడి ప్రకాశరావుకి కృతజ్ఞతలు తెలియజేశారు.

## యూనివర్సిటీ పొలిటికల్ సైన్స్ విభాగం విద్యార్థుల

# ఫ్రెషర్స్ పార్టీ సరదాలు






నన్నయ విశ్వవిద్యాలయంలో యూనివర్సిటీ పొలిటికల్ సైన్స్ విభాగం విద్యార్థుల ఫ్రెషర్స్ పార్టీ అదిరిపోయింది. విద్యార్థులు సరదాగా గడుపుతూ సందడి చేశారు. ఆటపాటలతో అందరినీ ఉత్సాహపరిచారు. ఒకరికొకరు తమ మనోభావాలను పంచుకున్నారు.

